క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంథని: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ కార్మికులకు ప్రకటించిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేశ్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పీఏ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు వడ్లకొండ రాజయ్య, చిప్పకుర్తి చందు, సింగరపు గట్టయ్య, మల్లేశ్, అశోక్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం, ఎల్కలపల్లి గేట్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించడంలో జాప్యం చేయడంతో కాలనీలో చెత్త పేరుకుపోయిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నెలల తరబడి సైడ్ డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో చెత్తతో డ్రైనేజీలు నిండి దుర్గంధం వెదజల్లుతోందని బుధవారం కాంగ్రెస్ నాయకులు సతీశ్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. డ్రైనేజీ సమస్యపై డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి

ముత్తారం: మండలంలోని పోతారం జెడ్పీ పాఠశాలలో పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోతారం జెడ్పీ పాఠశాలను ఎంపీడీవో కలికోట శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో బోధన చేస్తూ ఉత్తీర్ణత శాతం పెరిగేలా చూడాలని సూచించారు. సర్పంచ్ నెత్తెట్ల మహేందర్, ఎంపీవో భైరి వేణుమాధవ్, పాఠశాల హెచ్ఎం లక్ష్మీరాజం, కార్యదర్శి జీవన్ ఉన్నారు.

స్టాక్ మార్కెట్‌పై అవగాహన

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బుధవారం స్టాక్ మార్కెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంసీఎక్స్ మెటల్ అండ్ ఎనర్జీ సంస్థ ప్రతినిధి వెంకటకుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ శశాంక్, ప్రిన్సిపాల్లు కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయండి



సంతకాల సేకరణలో నాయకులు

గోదావరిఖనిటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రేణుకుంట్ల ప్రీతం డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం గోదావరిఖనిలో విద్యార్థులతో నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని సంతకాల సేకరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేశ్, సాగర్, సుస్మిత, శ్వేత, అరుణ, పవన్‌కల్యాణ్, రాజు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల గ్రామానికి చెందిన శ్రీలత అనారోగ్యంతో మృతి చెందగా శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున రూ.1.76లక్షల బీమా చెక్కును బుధవారం ఏజీఎం సురేశ్ బాధిత కుటుంబానికి అందజేశారు. డీఎం సతీశ్, మేనేజర్ గుర్రం శివకుమార్, సర్పంచ్ అంజయ్య, వార్డుసభ్యులు ఉన్నారు.

ఆర్జీ–1 ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే..

- రిపబ్లిక్ డే రోజున జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో సన్మానం



లింగయ్య | మొండి | మల్లయ్య | రాజయ్య | తిరుపతయ్య



ఖాజా తాజుద్దీన్ | మోహన్‌రెడ్డి | వెంకటస్వామి | భగవాన్‌రెడ్డి | అనిల్ గభాలే

గోదావరిఖని: సింగరేణి సంస్థ ఆర్జీ–1 ఏరియా ఉత్తమ ఉద్యోగుల పేర్లను యాజమాన్యం బుధవారం ప్రకటించింది. వీరిని గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని 26న జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ సింగరేణియన్స్, ఉత్తమ అధికారిని కొత్తగూడెంలో నిర్వహించే ప్రధాన కార్యక్రమంలో సన్మానించనున్నట్లు తెలిపారు. జీడీకే–1, 3వ గనికి చెందిన కోల్‌కట్టర్ పానగంటి లింగయ్య, జీడీకే–1, 3గని సపోర్ట్‌మెన్ బొటిక మొండి, జీడీకే–2, 2ఏ గనికి చెందిన సపోర్ట్‌మెన్ మీసాల మల్లయ్య, జీడీకే–11గని కంటిన్యూస్ మైనర్ ఆపరేటర్ చింతల తిరుపతయ్య, జీడీకే–2, 2ఏ గని జనరల్ మజ్దూర్ సూరం మోహన్‌రెడ్డి, జీడీకే–2, 2ఏ గని కోల్‌కట్టర్ ఎరవెల్లి రాజయ్య, జీడీకే–11 ఎలక్ట్రీషియన్ ఖాజాతాజుద్దీన్, జీడీకే–2,2ఏ గని చైన్‌మెన్ బోనుకల వెంకటస్వామి, జీడీకే–11 ఎస్‌డీఎల్ ఆపరేటర్ పెరటి భగవాన్‌రెడ్డిని ఉత్తమ సింగరేణియన్‌గా కొత్తగూడెంలో, ఉత్తమ అధికారిగా జీడీకే–5 ఓసీపీ కాలరీ మేనేజర్ అనిల్‌గభాలేను కొత్తగూడెంలో సన్మానించనున్నారు.

ఓటరు దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మంథని: జనవరి 25న నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో హనుమా నాయక్ కోరారు. బుధవారం ఆయా మండలాల తహసీల్దార్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి బీఎల్‌వో తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లో అందుబాటులో ఉంటారని, ప్రభుత్వ కార్యాలయంలో సిబ్బంది సంబంధిత అధికారులు ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

సింగరేణి రిటైర్డ్ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు

గోదావరిఖని: సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తోందని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఆరెల్లి పోశం ఆరోపించారు. బుధవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులు సర్వీస్ గ్రాట్యుటీ చెల్లింపు కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. క్వార్టర్ అప్పగింత సమయంలో రకరకాల కారణాలు చెప్తూ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. కోల్ ఇండియా సర్క్యులర్ ప్రకారం వెకేషన్‌తో సంబంధం లేకుండా గ్రాట్యుటీ చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. నాయకులు గండి ప్రసాద్, ఎంఏ గౌస్, తాళ్లపెల్లి మల్లయ్య, విక్రమ్, మహేందర్ రావు, ఎర్రల రాజయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఆడపిల్లలను చదువుకోనివ్వాలి



ముత్తారం: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో..



రామగుండం: మొక్క నాటుతున్న చిన్నారులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ ఆడపిల్లలను చదువుకోనివ్వాలని కేజీబీవీ పాలకుర్తి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వరూప కోరారు. బుధవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ సంతోష్ నగర్ ఏరియాలోని కేజీబీవీ పాకుర్తి పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు.

ఆదర్శలో జాతీయ బాలికల దినోత్సవం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఆదర్శ (మోడల్) అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ ప్రాంగణంలో తులసి మొక్క నాటారు.

ముత్తారం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, ఉపన్యాసాలు, పలు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన బాలికలను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కమల ప్రశంసించారు. కేజీబీవీ ఇన్‌చార్జి పి.సునీత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్లపై చెత్తవేస్తే జరిమానా

సుల్తానాబాద్: రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డులోని రోడ్లను బుధవారం కమిషనర్ పరిశీలించారు. స్వచ్ఛ మున్సిపల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ ఉన్నారు.

అభివృద్ధిమీద దృష్టిపెట్టండి

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని కార్పొరేటర్లు అవిశ్వాసం పేరుతో కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా కాలయాపన చేస్తున్నారని గోదావరిఖనిలోని ఫైట్ ఫర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆరోపించాడు. ఏ విభాగంలో చూసినా అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయని, వీటిపై కౌన్సిల్ హాల్‌లో చర్చించి ప్రజలకు మెరుగైన పాలన అందించడానికి కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ల గొడవలతో అభివృద్ధి మరింత కుంటుపడుతోందని విమర్శించారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాలు స్థానికులకే కేటాయించాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ కర్మాగారంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను స్థానికులకే కల్పించాలని తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించి నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలను స్థానిక కోటాలో భర్తీ చేయాలని, లేని పక్షంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్ మక్కాన్ సింగ్ నాయకత్వంలో ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం ముట్టడిస్తామని పేర్కొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేస్తాం

పెద్దపల్లిరూరల్: గ్రామస్థాయి నుంచి బీఎస్పీని బలోపేతం చేస్తామని పార్లమెంట్ పరిశీలకుడు కృష్ణనాయక్ అన్నారు. పెద్దపల్లిలో బుధవారం పార్లమెంటరీ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో నాయకులు ఈశ్వర్, విశ్వం, రాజనర్సయ్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. నాయకులు శారద, విష్ణు, సాగర్, సంతోష్, దుర్గయ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ గేట్ రాజీవ్ రహదారిపై బుధవారం సాయంత్రం కారు, సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. అన్నపూర్ణకాలనీకి చెందిన చీదురాల జ్ఞానదేశాలు సైకిల్‌పై మేడిపల్లి సెంటర్ నుంచి టీటీఎస్ గేట్ వైపు రోడ్డు క్రాస్ చేస్తుండగా గోదావరిఖని వైపు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జ్ఞానదేశాలుకు తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇటిక్యాల సత్తయ్యకు బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆర్థికసాయం అందజేశారు. కొంతకాలంగా సత్తయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. కాంగ్రెస్ నాయకులు సత్తయ్యను పరామర్శించారు. సేకరించిన రూ.20వేల నగదు అందించి తమ ఉదారతను చాటుకున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పాలకుర్తి: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన మహ్మద్ ముదాసిర్ అనే వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం బసంత్‌నగర్ పోలీసులు అందజేశారు. నాలుగునెలల క్రితం ముదాసిర్ బసంత్‌నగర్‌లో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించారు. బసంత్‌నగర్ రెండో ఎస్సై గంగరాజగౌడ్ బాధితుడికి అందజేశారు.

కనీస వేతనాలు చెల్లించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించేలా చూడాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా బంగ్లాస్ ఏరియా జోన్– 1 సివిక్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

మంథని: ఒలింపియాడ్ పోటీ పరీక్షల్లో పట్టణానికి చెందిన కాకతీయ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. లెవల్–1లో నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌కు 37 మంది, ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు 79 మంది లెవల్–2కు అర్హత సాధించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రదీప్‌రెడ్డి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

జ్యోతినగర్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే వికసిత్ భారత్ సంకల్పయాత్ర లక్ష్య సాధన అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద ఐదు రోజుల పాటు కొనసాగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగింపులో ఆయన మాట్లాడారు.

పన్నూర్ గ్రామంపై ప్రత్యేక దృష్టిసారించండి



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీటీసీ మహేశ్

రామగిరి: సింగరేణి నిర్వాసిత గ్రామమైన పన్నూర్ గ్రామంపై ప్రత్యేక దృష్టిసారించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఎంపీటీసీ చిందం మహేశ్ కోరారు. విదేశీ పర్యటన అనంతరం ధర్మపురికి వచ్చిన శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రామగిరి ఖిల్లాను పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని మంత్రికి తెలిపారు. ఆయన వెంట సోషల్ మీడియా కన్వీనర్ సిద్దం మురళీకృష్ణ ఉన్నారు.

గోశాల సందర్శన



గోశాల సందర్శనలో జెడ్పీచైర్మన్ పుట్ట మధు

మంథని: మండలంలోని భట్టుపల్లి గ్రామంలో గల కపిల గోశాలను బుధవారం పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు సందర్శించారు. గోవుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోవుల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గోమయంతో చేసే ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టిసారించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

కోనేరులో మల్లన్న భక్తుల స్నానాలు



ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు కోనేరులో బుధవారం స్నానాలు చేశారు. సమ్మక్క జాతర సందర్భంగా మల్లికార్జునస్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. మల్లికార్జునస్వామి, సీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శనం చేసుకున్నారు. స్వామివారికి పట్నాలు వేసి బోనాలు సమర్పించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

గోదావరిఖని: చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుని అరెస్ట్ చూపించారు. స్థానిక లక్ష్మీనగర్‌లో స్కూటీపై అనుమానాస్పదంగా తిరుగుతున్న స్థానిక కాకతీయనగర్‌కు చెందిన ఐత వెంకటేశ్(25)ను పట్టుకొని తనిఖీ చేయగా అతని వద్ద 3తులాల ముద్ద బంగారం, ఒక స్కూటీ స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించినట్లు పేర్కొన్నారు. ఈజీ మనీ కోసం దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య, క్రైం పార్టీ కానిస్టేబుళ్ల గోపతి వెంకటేశ్, తీట్ల శ్రీనివాస్‌ను సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు అభినందించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో రూ.3లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం పనులను పరిశీలించారు. ఎమ్మెల్సీ భానుప్రసాదరావు సమకూర్చిన నిధులతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

మంథని: డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ వాహనాలు నడపాలని పెద్దపల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం డ్రైవర్స్ డేను పురస్కరించుకొని డిపో మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మూలమలుపుల వద్ద జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, అతివేగంతో కాకుండా జాగ్రతగా వాహనాలు నడిపి సురక్షిత స్థానాలకు చేర్చాలని సూచించారు. ఏఎంఎఫ్ రామస్వామి, ఆర్‌హెచ్‌సీ వెంకటేశ్వర్లు, ఎస్‌డీఐ గోపాల్, బస్టాండ్ కంట్రోలర్ కేకే రెడ్డి పాల్గొన్నారు.



డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంవీఐ

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారు

ధర్మారం: కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మి రాష్ట్రంలో మార్పు కోరారని, ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను ఎలా అమలు చేస్తారని వేచి చూడాల్సిందేనని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి మహేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ధర్మారం మండల కార్యకర్తల సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదన్నారు. తప్పుడు కేసుల నమోదు నుంచి తమ పార్టీ కార్యకర్తలకు అండగా లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, స్థానిక సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, తుమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

ఆటో డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక

గోదావరిఖనిటౌన్: రామగుండం కార్పొరేషన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక లక్ష్మీప్రసన్న మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో 30 అడ్డాలకు సంబంధించిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అందరి అభిప్రాయాల మేరకు రామగుండం కార్పొరేషన్ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే బాసిద్‌పాషా, ప్రధాన కార్యదర్శి కండె కృష్ణ, అధికార ప్రతినిధిగా మణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఉప్పులేటి పర్వతాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కాల్వ లింగస్వామి, రాజేశ్, మహంకాళి స్వామి, బాలరాజు, మల్లేశ్, రవీందర్‌రెడ్డి సాయిలు, గట్టయ్య, మొగిలి, రామ్మూర్తి, కృష్ణ, విశ్వనాథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్స్ అండ్ ఓనర్స్ నూతన కమిటీ

కార్మికులకు వేతన బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ కార్యదర్శి ఎరవల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమ్మెకాలపు వేతనాన్ని ఇప్పటివరకు చెల్లించక పోవడం సరికాదన్నారు. మరోవారం రోజుల్లో పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగిసి, ప్రత్యేకాధికారుల పాలన అందుబాటులోకి రానుందని, ఈలోగా బకాయిలు చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుపర్చాలని డిమాండ్‌చేశారు. ఈ అంశాలపై ఈనెల 27న ఎమ్మెల్యేలు, 29న కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, నాయకులు మామిడిపల్లి తిరుపతి, నాగయ్య, అశోక్, నగేశ్, చంద్రమౌళి, లక్ష్మణ్, స్వామి, కిష్టయ్య పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయండి

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఇన్‌చార్జి జీఎం ఎస్.రాధాకృష్ణ ఆదేశించారు. సెంటినరీకాలనీ రాణీరుద్రమదేవి క్రీడాప్రాంగాణంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. అతిథులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. సివిల్ డీజీఎం పద్మరాజు, ఫారెస్ట్ డీజీఎం బి.కర్ణ, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, డీవైపీఎం గుర్రం శ్రీహరి పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాధాకృష్ణ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధిలోని ఓసీపీ–3లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏఐటీయూసీ నాయకులకు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఓసీపీ–3లో సుమారు 50మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, డివిజన్‌లోని అన్ని గనులకు సామన్లు సరఫరా చేసే ఓసీపీ–3 స్టోర్‌లో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రాజరత్నం, బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, స్టోర్స్ ఇన్‌చార్జి అనుమాండ్ల శంకర్, హుస్సేన్, చక్రపాణి, శ్రీకర్, మమత, దీప్తి, సువర్ణ, సుస్మిత పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఐపీఎస్ స్కూల్ విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్

సుల్తానాబాద్: పట్టణంలోని ఐపీఎస్ స్కూల్ విద్యార్థులు ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ సంజీవ్ తెలిపారు. స్కూల్ ఆవరణలో బుధవారం గోల్డ్ మెడల్స్ సాధించిన సంచిత్, విష్ణువర్ధన్, చందన, విజ్ఞశ్రీ, శ్రీనిధి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ సంజీవ్

కార్పొరేటర్‌కు ప్రశంస



ప్రశంసపత్రం అందుకుంటున్న కార్పొరేటర్ తేజస్వి

గోదావరిఖనిటౌన్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు నియోజకవర్గానికి చెందిన యువజన కాంగ్రెస్ కార్యదర్శి, కార్పొరేటర్ తేజస్వి ప్రకాష్. కాగా ఆమెకు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్రకార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ ప్రశంసపత్రం అందజేశారు.

విద్యార్థులకు షూ అందజేత



రామగిరి: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో శ్రీ.శే.సౌమిత్రి నారాయణచార్యుల జ్ఞాపకార్థం సుమారు 144 మంది విద్యార్థులకు రూ.35వేల విలువైన షూ, సాక్సులను ఎంపీడీవో ఇనుముల రమేశ్, సర్పంచ్ గంట పద్మ అందజేశారు. తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారి కుమారుడు సౌమిత్రి తిరుమలాచార్యులను అభినందించారు. ఎంపీటీసీ కొట్టె సందీప్, ఉపసర్పంచ్ వేము కనకయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక సారయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.